# నేను బతకొద్దా?

పొరుగింటి పుల్లయ్యకు ఒంట్లో బాగోలేక దాపులోవున్న ఒక పెద్ద బోర్డున్న పెద్ద డాక్టర్ దగ్గరికెళ్ళాడు. డాక్టర్ గారు అన్ని పరీక్షలు జరిపి, చిత్రగుప్తుడి చిట్టా అంత పొడవు లిస్ట్ మందులు రాశాడు. పుల్లయ్య ఆ మందుల చీటీ తీసుకుని వెళ్ళి, పక్కనేవున్న మెడికల్ షాపులో అన్ని మందులూ కొన్నాడు. వెంటనే ఆ మందులన్నీ తీసుకెళ్ళి, ఓ మూలగా వున్న బావిలో పడేసి ఇంటికొస్తున్నాడు.

అదంతా గమనిస్తున్న ఎదురింటి ఎల్లయ్య అడిగాడు పుల్లయ్యని—

"డాక్టర్ దగ్గరికెళ్ళి, అంత ఫీజు కట్టి, అన్ని పరీక్షలు ఎందుకు చేయించుకున్నట్టు?"

'డాక్టర్ బతకొద్దా?' అని సమాధానం చెప్పాడు పుల్లయ్య.

"అయితే ఆయన రాసిచ్చిన మందులన్నీ ఎందుకు కొన్నట్టు??" అని అడిగాడు ఎల్లయ్య.

"మందులషాపు వాడు బతకొద్దా?" అని చెప్పాడు పుల్లయ్య.

"మరయితే కొన్న మందులన్నీ బావిలో ఎందుకు పారేసినట్టు?" మళ్ళీ అడిగాడు ఎల్లయ్య.

"నేను బతకొద్దా?" అని చెప్పి, ఇంట్లోకి దూరి తలుపేసుకున్నాడు పుల్లయ్య.

అర్థమయిన ఎల్లయ్య ఆశ్చర్యపోయాడు!

❋